నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 29 మార్చి 2024 | NIRMAL

చెత్త, మురికినీటితో నిండిన బొడ్డొని కుంట

'బొడ్డొని కుంట' చెత్తమయం

ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీని అనుకుని ఉన్న 'బొడ్డొని కుంట' చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు, మురికి నీటితో నిండి దుర్గంధమయంగా మారింది. శాంతినగర్, తిమ్మాపూర్, సుభాష్‌నగర్, మదీనకాలనీవాసులు దోమలు, ఈగలు, మురికి నీటి వాసనతో అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు మురుగు నీరు, దోమల నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ చైర్మన్, కలెక్టర్‌లకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు మురికి నీటిని బొడ్డొని కుంటలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

- ఖానాపూర్, మార్చి 28

● జాతి వైరం మరిచి..

మేక పిల్లకు పాలిస్తున్న ఆవు

రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన రైతు ఆడె గోపాల్‌కు చెందిన ఆవు జాతి వైరం మరిచి మేక పిల్లకు నిత్యం పాలిస్తున్నది. గోపాల్ మేక పిల్లలను పెంచుకుంటున్నాడు. ఇటీవల తన ఆవు లేగదూడకు జన్మనిచ్చింది. లేగదూడతోపాటు నిత్యం మేకపిల్లలకు ఆవు పాలు పడుతున్నాడు.

- బోథ్, మార్చి 28

మహిళలే కీలకం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 8,42,054 మంది ఓటర్లు

కేసీఆర్ హయాంలో మహిళలకు పలు సంక్షేమ పథకాల అమలు

పురుషుల కంటే 39,509 మంది అతివలే అధికం

ఆదిలాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో మహిళల పాత్ర కీలకం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఇటీవల విడుదలు చేసిన ఓటరు జాబితాలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 16,44,715 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 8,42,054 మంది మహిళలు, 8,02,575 మంది పురుషులు ఉన్నారు. సర్వీస్ ఓటర్లలో మరో 30 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 39,509 మంది అధికంగా ఉన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా సిర్పూర్ మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. నిర్మల్ నియోజకవర్గంలో 1,35,702 మహిళా ఓటర్లు ఉండగా పురుషులు 1,21,527 మంది ఉన్నారు. ఆసిఫాబాద్‌లో 1,14,056 మంది మహిళలు, 1,12,510 మంది పురుషులు, ఖానాపూర్‌లో 1,14,437 మంది మహిళలు, 1,09,333 మంది పురుషులు, ఆదిలాబాద్‌లో 1,24,375 మంది మహిళలు, 1,19,154 మంది పురుషులు, బోథ్‌లో 1,08,580 మంది మహిళలు, 1,02,333 మంది పురుషులు, మథోల్‌లో 1,30,545 మంది మహిళలు, 1,23,234 మంది పురుష ఓటర్లు ఉన్నారు.

కేసీఆర్ పాలనలో అనేక పథకాలు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసింది. ప్రభుత్వం అందజేసే వివిధ స్కీంలను మహిళల పేరిట మంజూరు చేసింది. పదేళ్లలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసిన కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, అమ్మఒడి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, వితంతు, ఒంటరి మహిళా పింఛన్‌లను మంజూరు చేసింది. మహిళల ఆరోగ్య రక్షణలో భాగంగా ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రారంభించి ప్రతి మంగళవారం దవాఖానల్లో మహిళలకు వివధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేశారు. బాలికల కోసం ప్రత్యేకించి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచితంగా విద్యను అందించింది. విద్యతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కల్పించింది. గతంలో ఆడపిల్లలు బయట తిరగాలంటే భయపడేవారు. అమ్మాయిల రక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. షీ టీంలను ఏర్పాటు చేసి వారికి రక్షణ కల్పించడంతోపాటు సఖీ కేంద్రాల ద్వారా మహిళలు, యువతలకు అవసరమైన సాయం అందజేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పలు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన మహిళలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలిచే అవకాశాలున్నాయి.



ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం

అసెంబ్లీ సెగ్మెంట్లు	07
ఓటర్లు	8,42,054
పురుషులు	8,02,575
మహిళలు	8,42,054

భగీరథ నీరు రావడం లేదని కలెక్టర్‌కు విన్నవిస్తున్న లక్ష్మీపూర్ గ్రామస్తులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి..

భగీరథ నీరు రావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

తాంసి(తలమడుగు), మార్చి 28 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టర్ తలమడుగు మండలంలో పర్యటించారు. ముందుగా పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని అన్నారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద రూ.50వేల కంటే ఎక్కువ తీసుకువెళ్తే అధికారులు సీజ్ చేయాలన్నారు.

రెండు రోజులే నీళ్లు వస్తున్నాయని ఫిర్యాదు

లక్ష్మీపూర్‌కు కలెక్టర్ రావడంతో గ్రామస్తులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వారంలో రెండు రోజులు మాత్రమే మిషన్ భగీరథ నీరు వస్తుందని, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో కలిసి తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలోని పంప్ హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. వెంటనే పంప్‌హౌస్ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపుహౌస్ పనులు పూర్తయితే తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లోని గ్రామాలకు భగీరథ నీరు అందుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎస్సై ధనశ్రీ, ఎంఈవో నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిబంధనల మేరకే అనుమతులు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మార్చి 28 : ప్రభుత్వ నిబంధనల మేరకే లే అవుట్, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్ కుమార్‌లతో కలిసి జిల్లా స్థాయి లే అవుట్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రమ లే అవుట్‌లు, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలను నిలిపివేయాలని సూచించారు. నూతన లే అవుట్‌లలో రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్ వంటి వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కమిటీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కల్యాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజినీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

పకడ్బందీగా శిక్షణ నిర్వహించాలి..

ఇచ్చోడ, మార్చి 28 : పీవో, ఏపీవో, ఓపీవోలకు పకడ్బందీగా శిక్షణ నిర్వహించాలని బోథ్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, విద్యాధికారులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4 వరకు పీవో, ఏపీవో, ఓపీవోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. శిక్షణ కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సమావేశంలో ఇచ్చోడ తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రామారావ్ పాల్గొన్నారు.

పీవీటీజీల అభివృద్ధికి కృషి

ఉట్నూర్, మార్చి 28 : గిరిజనులలో అత్యంత వెనుకబడిన పీవీటీజీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం స్తానిక పీవో క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉన్న పీవీటీజీలను ఆర్థికంగా అభివృద్ధి పర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పేపర్ ప్లేట్స్ తయారీ, ఇప్పపువ్వు ప్రాసెసింగ్ ఫినిషింగ్ యూనిట్, పేపర్ బ్యాగ్ యూనిట్‌లను స్థాపించేందుకు, పీవీటీజీల జీవనోపాధికి సహకరించి శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రామన్న

బీఆర్ఎస్‌దే విజయం

● నాయకులు పార్టీ మారినా నష్టం లేదు ● ప్రజలు మాతోనే ఉన్నారు

● కాంగ్రెస్ 420 హామీలు ఏమయ్యాయి? ● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్‌కు ఇతర పార్టీల కంటే అధిక ఓట్లు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన 420 హామీలను ముల్లెకట్టి పక్కన పెట్టిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, చిరు ఉద్యోగులతోపాటు అందరిని మోసం చేసిందని, ప్రజల దృష్టి మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఇతర అంశాలను తెరపైకి తీసుకు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.3 వేల కోట్లను సంపాదించి ఢిల్లీకి నోట్ల సూట్‌కేసులను మోస్తున్నారని ఆరోపించారు. కొందరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడుతున్నా వచ్చిన నష్టమేదిలేదని పేర్కొన్నారు. నాయకులు తమ ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీ మారుతున్నారన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

రంజాన్ పండుగను పురస్కరించుకుని నేడు (శుక్రవారం) బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీఆర్ఎస్ కార్యాలయంలో విందు ఉంటుందని, మసీద్‌ల ఇమామ్‌లు, ముస్లిం సోదరులు ఈ విందుకు హాజరుకావాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యూనీస్ అక్బాని, సాజీదొద్దీన్, జహీర్ రంజానీ, రోకండ్ల రమేశ్, విజ్జిగిరి నారాయణ, శ్రీనివాస్, ఆసిఫ్, సలీం పాషా, అన్సర్, హైమద్ పాల్గొన్నారు.

సానాల మండలం కలేనా?

● గెజిట్ విడుదలై ఏడు నెలలు ● స్థలాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్

● జాప్యంపై గ్రామస్తుల్లో ఆందోళన

బోథ్, మార్చి 28 : మండలంలోని వజ్జర్, చింతల్‌బోరి, ఘన్‌పూర్, సానాల, కోటా(కే), సాకెర, టీవీటీ, పార్డీ(బీ), పార్డీ(కే), గొల్లాపూర్ రెవెన్యూ గ్రామాలను కలిపి సోనాలను మండలంగా ఏర్పాటు చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 4, 2023న గెజిట్ విడుదల చేయగా.. అప్పటి కలెక్టర్ గ్రామాన్ని సందర్శించారు. మండల కార్యాలయాల కోసం అనువైన భవనాలు, స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియ నిలిచింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనా మండల కార్యాలయాల ప్రారంభం విషయంలో కాలయాపన చేయడంతో సానాల చుట్టూ పక్కల గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడం, జూన్ 4 వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో ప్రక్రియ పూర్తవుతుందా.. లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నియమావళి పూర్తికాగానే సానాల మండల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోనాల గ్రామం

'ఉపాధి'కి ఏదీ నీడ

● పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కరువు

● జాడలేని టెంట్లు, మెడికల్ కిట్లు

● వేసవి భత్యం లేనట్లేనా?

నిర్మల్, మార్చి 28(నమస్తే తెలంగాణ) : ఎండలు ముదురుతున్నాయి. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. పనులు చేసి సేద తీరేందుకు అవసరమైన టెంట్లు వేయాల్సి ఉన్నా.. కొన్నేళ్లుగా వీటి సరఫరా నిలిచింది. దీంతో ఎండలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. వేసవిలో మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు పనులు జరిగే ప్రాంతాల్లో వసతులు కల్పించాలి. వడదెబ్బ తగలకుండా గుడారాలు వేయాలి. కానీ.. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. కూలీలు ఎండలో పని చేస్తూ అస్వస్థతకు గురవుతున్నారు. పనులు ప్రదేశంలో దెబ్బ తగిలితే అక్కడే ప్రథమ చికిత్స అందించాలి. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. జిల్లాలోని పని ప్రదేశాల్లో ఎక్కడ కూడా మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. ప్రభుత్వమే గడ్డపార, పార, తట్టలను పంపిణీ చేయాలి. గతంలో ఇవన్ని ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు వాటి ఊసే లేకపోవడంతో కూలీలే తమ సొంత ఖర్చులతో కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1.30 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. ప్రస్తుతం రోజు 26,226 మంది పని చేస్తున్నారు. రోజుకు సగటున ఒక్కో పంచాయతీలో 66 మంది కూలీలు హాజరవుతున్నారు. నీటి వనరుల్లో పూడికతీత, పంట కాలువలు, మట్టి రోడ్ల నిర్మాణం, కందకాల తవ్వకాలు, నర్సరీల్లో మొక్కల పెంపకం వంటి పనులు కొనసాగుతున్నాయి.

ఖానాపూర్ మండలంలోని సత్తనపెల్లిలో మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

అనేక ఇబ్బందులు

కూలీలు భోజనం చేయడానికి, అలసి పోయినప్పుడు సేదతీరడానికి గతంలో ప్రభుత్వం గుడారాలు(టెంట్లు) పంపిణీ చేసేది. వాటిని ఫీల్డ్ అసిస్టెంట్లు రోజు పని ప్రదేశానికి తీసుకెళ్లి వసతి కల్పించేవారు. అప్పట్లో ఇచ్చిన టార్పాలిన్లను భద్రంగా ఉంచాలని మేట్‌లకు బాధ్యత అప్పగించారు. పనుల వద్ద కూలీలు నీడన ఉండడానికి ఈ టార్పాలిన్లు వేయాల్సిన బాధ్యత కూడా వారిదే. కొంతకాలంగా వీటి పంపిణీని ప్రభుత్వం మరిచింది. ప్రభుత్వం టార్పాలిన్లను సమకూర్చాలని, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ కిట్లలో అయోడిన్ బాటిల్, బ్యాండేజి, కాటన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు ట్యాబ్లెట్లు ఉండేవి. కాగా.. వేసవిలో పని చేసే కూలీలకు మూడు నెలలపాటు అదనపు భత్యాన్ని అందజేసేవారు. మార్చి నెలలో 20 శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30 శాతం పెంచి చెల్లించేవారు. ఇప్పుడు ఆ చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు వసతులను సమకూర్చి, వేసవిలో అదనపు భత్యాన్ని చెల్లించాలని కోరుతున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

బాసర, మార్చి 28 : బాసర రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ట్రాక్‌పై ప్రేమ జంట బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. నాగర్సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న రైలు కింద పడి అక్కడిక్కడే మృతి చెందారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నందిత ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నది. నిజామాబాద్‌కు చెందిన శ్రీకాంత్ ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తున్నది. దీంతో వీరి ప్రేమ వివాహానికి ఇంట్లో వాళ్లు ఒప్పుకుంటారో లేదోననే భయంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు వారి బంధువులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టాలి..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 28 : క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎస్టీఐ, ఆర్టీఐ వివరాలను హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. క్షయ వ్యాధి నియంత్రణలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు రాజశేఖర్, సతీశ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.